మయి ఉన్నా, వాళ్ళు అందరూ తనకి ఆప్తులు కాదు. మానసికంగా వాళ్ళు తనకి దగ్గరకాదు కూడాను. వాళ్ళ స్వార్థంకోసం తన స్వార్థాన్ని వాళ్ల సంతృప్తి పరచారు.

గీత అలాగ కాదు.

ఆమెతో పరిచయం అయాక ఆమెని పెళ్ళి చేసుకుందామని తాను మనసారా కోరాడు.

అందరిలాగానే, ఆమెతో తాను తిరిగి. యవ్వనంలో సహజమైన ఆనందాన్ని అమెతో పంచుకున్నాడు. ఆమెచుట్టా లెవరో హఠాత్తుగా పోయి ఉండడాన్న కాని, త్వరలో ఆమెని వివాహం చేసుకుని ఉండేవాడు.

మరొక ఆరు నెలలు గడువుపడింది వివాహం.

ఆ ఆరు నెలలలోనూ మూడు బాగానే గడిచాయి.

ఆ తరువాత....

ఆ సాయంత్రం మళ్ళీ జ్ఞాపకం చేసుకోవాలనిపించలేదు శేఖర్‌కి. అయినా అతనికి వివరాలు ముందునించీ తెలీవు.

అతనికి జ్ఞాపకం—ఆమెని ఆ సాయంత్రం గేలార్డ్‌లో కలుసుకోడానికి ఆరునించీ ఎదురు చూపి, ఆరున్నరకి ఆమె రాగానే. ఆమెని దూషించడం! ఆమె కన్నీళ్ళతో ఏదో అనబోతే ఆమెని లెంపమీద కొట్టడం.

దానితో ఆ సంబంధం రద్దు అయిపోయింది.

తానూ రద్దు అయాడు—చాలా మందికి. కోర్టు కేసులో తాను "గిల్టీ" ప్లీడ్ చేసి రెండు వొందల రూపాయిల జుల్మానా కట్టాడు

తరవాత....

తరవాత అమిత: ఆమెతోనూ పోట్లాట....

* * * *

శేఖర్ బలవంతంగా ఆలోచనలని ప్రస్తుతానికి తెచ్చుకున్నాడు. జరిగిన వన్నీ జ్ఞాపకాలుగా తనకి కలిగించేది బాధకన్నా

అతనికి శాంతిని గురించి ఆలోచించాలని లేదు. కాని ఆమెని గురించి తప్ప ఆలోచించ లేకుండా ఉన్నాడు.

కొద్ది నిమిషాలు శేఖర్ దృష్టినంతనీ టెలిఫోన్‌మీద కేంద్రీకరింప జేశాడు. అది తనకి శాంతినించి సందేశం తెస్తే....

అత నెంత తీవ్రంగా టెలిఫోన్‌మీద దృష్టి నిలిపినా ఏమీ జరగలేదు.

నాలుగయింది....

మరో ఇరవై నిమిషాల తరవాత అయిదు ...

ఇంక ఆగలేక అతను ఆమె ఇంటికి టెలిఫోన్ చేశాడు—కాని, ఆమె ఇంకా రాలేదని చెప్పేరు.

ఆమె ఆఫీసుకీ టెలిఫోన్ చేశాడు—

నాలుగు కాకుండానే ఆమె వెళ్లిపోయిందని చెప్పేరు. అతనికి కోపం వొచ్చింది. శాంతి ఎక్కడికి వెళ్లింది?

ఆమె వెంటనే వొస్తే బాగుండును....

మళ్లీ గదిలో పచారుచెయ్యడం ప్రారంభించాడు.

శాంతి ఎందుకు మారిపోతోంది?

షా జ్ఞాపకం వొచ్చాడు. అతనికి లండన్‌లో పోస్టింగ్ వొచ్చిందని విన్నాడు....కాని శాంతి ఆ రాత్రితో అతనితో పూర్తిగా తెగతెంపులు చేసుకుంది. మరి?

ఎన్ని యుగాలో గడిచాక ఆరయింది.

శాంతి రాలేదు.

నర్స్‌వొచ్చి మందు లిచ్చి, డాక్టర్‌ని పిలిచింది. డాక్టర్ అతనికి సెడెటివ్ ఇచ్చి నిద్ర పోగొట్టాడు.

ఆ తరువాత నాలుగు రోజులూ శేఖర్ చాలా మంచి పేషంటుగా గడిపాడు... శాంతి ఇంక రాదని నిర్ణయించుకున్నాక అతనికి కొత్త ప్రశాంతి కలిగింది. అతని దైహిక పరిస్థితి మారి అతను అడగగానే డాక్టరు డిశ్చార్జి చేశాడు.

ఆఫీసునుంచి కొలీగ్సూ, ఇద్దరు డైరెక్టర్లూ వొచ్చి అతనికి

